ప్రజాశక్తి
శుక్రవారం 12 జులై 2024 5 విజయనగరం



బాలికల వసతి గృహంలో తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని మహారాణి పేట లోగల గిరిజన సంక్షేమ ప్రభుత్వ పోస్ట్ మెట్రిక్ కళాశాల బాలికల వసతిగృహాన్ని గురువారం సీనియర్ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. వసతి గృహం శిథిలావస్థకు చేరినందున వేరొక చోటకు మార్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించారు. విద్యార్థులకు గిరిజన సంక్షేమ చట్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రామానంద, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు లక్ష్మి నారాయణ, నాగమణి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రుణం తీర్చుకుంటాం

- ఎకనమిక్ హబ్‌గా భోగాపురం
- ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి
- భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పరిశీలించిన సిఎం చంద్రబాబు
- ఘనంగా స్వాగతం పలికిన అధికారులు, ప్రజాప్రతినిధులు


ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ భోగాపురం

'ఈరోజు నేను ఇక్కడకు ప్రధానంగా వచ్చింది మా ఎన్‌డిఎ కూటమికి ఉత్తరాంధ్ర బ్రహ్మరథం పట్టారు. ఓట్ల వర్షం కురిపించారు. రాష్ట్రమంతా సునామీ, ఆ సునామీలో నెంబర్ వన్ ఉత్తరాంధ్ర. నేను కూడా సందేశం ఇవ్వాలనే ఇక్కడకు వచ్చాను. ఎప్పుడూ కూడా ఓట్లు వేసిన వారినిగానీ, ప్రాంతాలనుగానీ మర్చిపోవడం సబబు కాదు. అందరికీ న్యాయం చేస్తాం, కానీ ఉత్తరాంధ్రకు అదనంగా చేయాల్సి ఉంది. ఆ నమ్మకం కూడా మామీద పెట్టుకున్నారు'. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 'నేను ఈ ప్రాంతవాసులందరికీ హామీ ఇస్తున్నాను. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసి చూపిస్తాను' అని చెప్పారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం పరిశీలించారు. ప్రభుత్వ అధికారులు, ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ (జిఎంఆర్) అధికారులతో కలిసి తొలుత సమీక్ష చేశారు. అనంతరం టెర్మినల్ నిర్మాణాలు జరుగుతున్న చోట విలేకర్ల సమావేశం నిర్వహించారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ 2026 జూన్ నాటికి పూర్తిచేస్తామని చెప్తోందని, తాను ఇంకా ముందుగానే అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం తరపున పూర్తిగా సహకరిస్తామనారు. తాను ఎప్పటికప్పుడు పోలవరం ప్రాజెక్టును సందర్శించి రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నట్టే, ఎయిర్‌పోర్టు పనులు పరుగులెత్తించే బాధ్యత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించానని అన్నారు. ప్రస్తుతం విశాఖపట్నం ఎయిర్‌పోర్టు 2.8 మిలియన్ ప్రయాణికులకు సేవలు అందిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం నాటికే 4.5 మిలియన్ ప్రయాణికులకు సేవలు అందించేలా రూపకల్పన జరుగుతోందని అన్నారు. క్రమంగా దీని కెపాసిటీ 45 మిలియన్ ప్రయాణికులకు సేవలు అందించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి కల్పన ఏమేరకు అందించగలమనేదానిపై నిర్మాణ సంస్థ నుంచి నివేదిక కోరామని తెలిపారు. ఈ ఎయిర్ పోర్టు పూర్తయితే రాయగఢ్, కోరాపూట్, మల్కన్‌గిరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుందన్నారు. అధికారుల సమీక్షలో కొన్ని చిన్న చిన్న సమస్యల ను కూడా తమ దృష్టికి వచ్చాయని, ప్రధానంగా నేషనల్ హైవే నుంచి 6 కిలోమీటర్ల మేర రోడ్డు కనెక్టివిటీ, పాత నేషనల్ హైవేలో 12 చోట్ల కనెక్టివిటీలు, జంక్షన్లను అభివద్ధి చేయడం వంటివి ఉన్నాయని అన్నారు. వీటన్నింటినీ ఒక్కొటిగా పరిష్కరి స్తామని తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా ఎక్కడ నుంచి బయలుదేరినా నేరుగా విమానా శ్రయానికి చేరుకునే అవకాశం ఉందని, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అదే విధమైన రోడ్డు కనెక్టవిటీ కల్పిస్తామని అన్నారు. దీనికి ముందు ఎయిర్‌పోర్టులో జిఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించారు. జిఎంఆర్ సంస్థ బిజినెస్ ఛైర్మన్ జిబిఎస్ రాజు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐపి రావు పవర్ పాయింట్ ద్వారా ఎయిర్‌పోర్టుకు సంబంధించిన అంశాలను వివరించారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించి 97 శాతం ఎర్త్ వర్క్స్ , 32 శాతం రన్‌వే పనులు, టాక్సీ వే పనులు 16 శాతం వరకు పూర్తయినట్లు వారు పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి సంబంధించి విశాఖ నుండి భోగాపురం మధ్య 12 క్రిటికల్ జంక్షన్లు ఉన్నాయని, వాటిపై ఫ్లై ఓవర్స్, బ్రిడ్జిలు వేయవలసిన అవసరం ఉందని వివరించారు. భోగాపురం నుండి శ్రీకాకుళం వరకు ఉన్న స్టేట్ హై వేస్‌ను 2 లైన్ల నుండి 4 లైన్లకు మార్చాలని, విశాఖపట్నం బీచ్ నుండి భోగాపురం వరకు 6 లేన్ల రహదారి వేయాలని సిఎంకు తెలిపారు. తారకరామా తీర్ధ సాగర్ పూర్తి చేయడం ద్వారా ఎయిర్‌పోర్టుకు నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. 132 కెవి సబ్‌స్టేషన్ కోసం 5.47ఎకరాలను కేటాయించారని, గత రెండు నెలలుగా బిల్లులు చెల్లించలేదని, నిధులు కేటాయిస్తే ఆ పనులు కూడా పూర్తి చేస్తామని కోరారు. సిఎం స్పందిస్తూ అన్ని రకాల అనుమతులను, నిధులను, కనెక్టివిటీ వ్యవహారాలను అత్యంత ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. పనులు వేగవంతం చేసి లక్ష్యానికి 6నెలల ముందే ఆపరేషన్‌లోకి వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర పౌర విమాన యాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు లోకం మాధవి, బేబినాయన, తోయక జగదీశ్వరి, విజయ్‌చంద్ర, కోండ్రుమురళీ, కిమిడి కళా వెంకటరావు, కోళ్ల లలితకుమారి, జిఎంఆర్ బిసిఎం బివిఎన్ రావు, మాజీ పౌర విమాన శాఖా మంత్రి అశోక్ గజపతి రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ , ఎస్‌పి ఎం.దీపిక, ఆర్‌డిఒ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎయిర్‌పోర్టు స్థలానికి చేరుకున్న ముఖ్యమంత్రికి కలెక్టర్ సహా ప్రజాప్రతినిధులంతా పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. సిఎం చంద్రబాబును పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, శత్రుచర్ల విజయరామరాజు కలిశారు. పతివాడను చంద్రబాబు ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మాజీ మంత్రి పతివాడను పలుకరిస్తున్న చంద్రబాబు



సమావేశంలో చంద్రబాబుకు ఎయిర్‌పోర్టు వివరాలు తెలుపుతున్న అధికారులు



సిఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ అంబేద్కర్



ప్రయాణికులపై టోల్ వడ్డన

- టికెట్‌పై రూ.10 ఛార్జీ పెంపు
- జిల్లాలో పెద్దఎత్తున వ్యతిరేకత
- ఇప్పటికే ఆందోళనలు
- టోల్‌గేట్‌ను ఎత్తివేయాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

డెంకాడ మండలం జొన్నాడ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాతో ఆర్‌టిసి ప్రయాణికులపై ప్రభావం పడింది. విజయనగరం నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులకు బస్సు ఛార్జీలు పెరిగాయి. ఇప్పటికే ఆర్‌టిసిలో ప్రస్తుతం ఏ రాష్ట్రంలో లేనంతగా మన రాష్ట్రంలో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు తాజాగా టోల్‌ప్లాజా ఏర్పాటుతో ప్రయాణికులపై మరింత భారం పడింది. ప్రయాణికులు ప్రతి టికెట్ పైనా రూ.10 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో విజయనగరం నుంచి వైజాగ్‌వైపు వెళ్లే ప్రయాణికులు రానూపోనూ రూ.295 చెల్లించుకోవాల్సి వస్తోంది. అల్ట్రా డీలక్స్ ఛార్జీ విశాఖకు ప్రస్తుతం రూ. 90 ఉంటే రూ.100 చెల్లించాల్సి ఉంది. సూపర్ లగ్జరీ టిక్కెట్ ఛార్జి రూ.100 ఉండగా రూ.110 అయ్యింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రస్తుతం రూ.75 చెల్లిస్తుండగా, రూ.5 పెరిగింది. పల్లె వెలుగు బస్సు ఛార్జీలు 60 రూపాయల నుంచి 70 రూపాయలకు పెరిగింది. ఈ లెక్కన ఒక రోజులో 42ట్రిప్పులు తిరుగుతున్న బస్సులు టోల్‌గేటు ఛార్జీలు రూ.11,130 చెల్లించు కోవాల్సి వస్తోందని డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు తెలిపారు.

టోల్‌గేటును ఎత్తివేయాలని డిమాండ్

ప్రయాణిలకు భారంగా మారిన టోల్‌గేట్‌ను ఎత్తివేయాలని ఇప్పటికే సిపిఎంతో పాటు పలు ప్రజాసంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. దీనికి తోడు మానాపురం వద్ద కూడా మరో టోల్‌గేటు ఏర్పాటవుతోంది. అది పూర్తయితే అటు సాలూరు, బొబ్బిలి నుంచి వచ్చి పోయే ప్రయాణికులకు రెండువైపులా ప్రయాణికులపై తీవ్ర భారం పడనుంది. ఈనేపథ్యంలో టోల్‌గేట్‌ను ఎత్తివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత ఇసుక సరఫరాపై టోల్‌ఫ్రీ నెంబరు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉచిత ఇసుక సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సరఫరాకు సంబంధించి ఏమైనా సమాచారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసింది. ఏమైనా ఫిర్యాదులు, సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 18004256014, లేదా 9032338135 నెంబరుకు సంప్రదించవచ్చు.

ఆక్సిజన్ సిలిండర్ పేలి జవాన్ మృతి

ప్రజాశక్తి-బాడంగి

ఆక్సిజన్ సిలిండర్ పేలి బొత్సవానివలసకు చెందిన జవాన్ మృతి చెందిన జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో గురువారం చోటుచేసుకుంది. బాడంగి మండలం బొత్సవానివలస గ్రామానికి చెందిన గొట్టాపు శంకర్రావు (41) ఇండియన్ ఆర్మీలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. 17ఏళ్ల వయసులో ఉద్యోగం సాధించిన ఆయన.. మరో ఆరు నెలల్లో రిటైర్డు కానున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గురువారం ఉదయం మరో జవాన్‌తో కలిసి ఆక్సిజన్ సిలిండర్‌కు మరమ్మతులు చేస్తుండగా అది పేలిపోవడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో వారంతా కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదం అలముకుంది. శంకర్రావుకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. శంకర్రావు మృతదేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో శుక్రవారం సాయంత్రానికి విశాఖకు, అక్కడి నుంచి వాహనంలో గ్రామానికి తీసుకువస్తారని తెలిసింది.



శంకరరావు (ఫైల్)



దాసన్నపేట రైతు బజార్‌లో కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, జెసి కార్తీక్

సబ్సిడీతో కందిపప్పు విక్రయాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతి పేదవాడూ సంతృప్తిగా భోజనం చేయాలనే ఉద్దేశంతోనే రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం సబ్సిడీ ధరలపై విక్రయిస్తున్నట్లు ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. గురువారం స్థానిక దాసన్నపేట రింగ్‌రోడ్ రైతు బజార్‌లో సబ్సిడీపై కందిపప్పు విక్రయాలను వారు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే సంక్షేమ పథకాలను అమలు చేసిన మహా నాయకుడు నందమూరి తారక రామారావు అని, ఆయన ఆశయాలు కనుగుణంగా నేడు చంద్రబాబు సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఐదు రైతు బజార్లతో పాటు హోల్‌సేల్ మార్కెట్లలో కూడా ఇదే ధరలకు విక్రయిస్తారని తెలిపారు. కందిపప్పు ధర మార్కెట్లోకిలో రూ.181 ఉంటే ఇక్కడ రూ.160కే అందిస్తారని తెలిపారు. బియ్యం స్టీమ్డ్ బిపిటి, సోనా మసూరి 55.85 పైసలుండగా 49 రూపాయలకు అందజేస్తారని తెలిపారు. ఈ ధరల కంటే ఎక్కువకు ఎవరైనా విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాబ్‌మేళాకు 93 మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 93 మంది నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. భారత్ ఫైనాన్సియల్ ఇన్ క్లూసిన్ లిమిటెడ్ 30 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేయగా, హెట్రోలాబ్స్ 11మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేసింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. అరుణ, కంపెనీ హెచ్.ఆర్.లు టి.అరవింద, సిహెచ్ మణకంఠ, ప్రొఫెసర్ ఎం. యశ్వంత్ బాబు, కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం థీమ్ 2024 ఏమిటంటే 'ఎవరినీ వదిలిపెట్టవద్దు, ప్రతి ఒక్కరిని లెక్కించండి' అని తెలిపారు. పెరుగుతున్న ప్రపంచ జనాభా అనేక కొత్త సమస్యలను సృష్టిస్తోందని, కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పర్యావరణ ప్రభావం జనాభా సమస్యల్లో ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న జనాభా కారణంగా, ప్రసూతి ఆరోగ్యం, కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమస్యలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం , మాత ఆరోగ్య సేవలకు, మహిళలకు ప్రాముఖ్యత ఉండేలా చూసుకోవడం గతంలో కంటే మరింత అత్యవసరమన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, జనాభా సమస్య కారణంగా లింగ అసమానత , మానవ హక్కుల నేరాలు గతంలో కంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈనేపథ్యంలో లింగ బేధం లేకుండా ఎవరినైనా సమానంగా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య , ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె. రాణి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎన్.సూర్య నారాయణ, జిల్లా టీకా నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.అచ్యుత కుమారి, జిల్లా మాస్ మీడియా అధికారి వి.చినతల్లి గారు, డెమో సెక్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

విద్యార్థులకు పోటీలు

విజయనగరం టౌన్ : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక గురజాడ స్కూలు విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు 40 జట్లుగా జట్టుకు 8మంది చొప్పున 320 మంది పాల్గొన్నారు. ప్రథమ , ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 24 మంది విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్‌ఎం పూడి శేఖర్ అభినందించారు.

వ్యర్థాలతో వస్తువులు తయారీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాదేది వ్యర్థానికనర్హం అంటూ రుజువు చేస్తున్నారు నగరపాలక సంస్థ కు చెందిన ప్రజారోగ్య విభాగం సిబ్బంది. వ్యర్థాలతో వినిమయ వస్తువులను చేయడమే కాకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఓవైపు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను చైతన్య పరుస్తూనే మరోవైపు వ్యర్థాలతో ఉపయుక్తమైన వస్తువులను తయారు చేస్తూ వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యర్థాలతో తయారు చేసిన ఆకృతులు చూపరులను ఆకర్షిస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్ టైర్లతో కుర్చీలు, టీపాయలుగా తయారు చేయడం, ప్లాస్టిక్ బాటిళ్ల తో గార్డెనింగ్‌కు అవసరమైన విధంగా తీర్చిదిద్దడం ఆసక్తిని కలిగిస్తోంది. కొన్ని రకాల వస్తువులను తయారు చేసి వాటిని ఇంటికి ఆకర్షణ ఉండే విధంగా, మొక్కల పెంపకాన్ని చేపట్టేట్టుగా రూపొందిస్తున్నారు. రెడ్యూస్, రీసైకిల్, రియూస్ (ఆర్ఆర్ఆర్) అనే విధానంలో వ్యర్థాలతో వస్తువులను తయారు చేసి ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఈ విధానం రానున్న రోజుల్లో మరిన్ని విభిన్న ఆకతులు తయారీకి దోహదపడగలదన్న ఆశాభవాన్ని కమిషనర్ ఎంఎం నాయుడు వ్యక్తం చేశారు. ప్రజలు కూడా వ్యర్థాలతో విభిన్న వస్తువులను తయారు చేసి ఇంటికి అలంకరణతో పాటు మొక్కలు పెంచుకునే విధంగా తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు.



ఆకృతుల వద్ద ఫొటో దిగిన కమిషనర్

'సీతం'లో ఎన్‌సిసి బి సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో (యన్.సి.సి) బి. సర్టిఫికెట్‌లను గురువారం అందజేశారు. 2024 మార్చిలో జరిగిన (యన్‌సిసి) బి సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత అయిన సీతం(20), సత్య(30),ఉమాభారతి(20) క్యాడెట్లకు ఎన్‌సిసి 2(ఎ)గర్ల్స్ బెటాలియన్ స్టాఫ్ డిఎస్ బొడలే (ఎస్.యమ్) ఆధ్వర్యంలో సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావు, సీతం ప్రిన్సిపల్ డాక్టర్ రామమూర్తి, డీన్ డాక్టర్ నరేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, సత్య డిగ్రీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, ఉమాభారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిల్, సీతం కళాశాల లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, ఎస్. ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, సురేష్ తదితరులు

ఖాతాదారుల డిపాజిట్ డబ్బులు వెంటనే చెల్లించాలి

15న సహారా బాధితుల చలో కలెక్టరేట్

తరలి రావాలని సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సహారా ఇండియా కస్టమర్లకు, ఏజెంట్లకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, సహారా ఖాతాదారుల కమిటీ కన్వీనర్ డి.లక్ష్మీదాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బాధితులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. గురువారం ఎల్‌బిజి భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సహార ఇండియా కంపెనీ బాధితులు జిల్లాలో సుమారు లక్ష మంది వరకు ఉన్నారని, ఏజెంట్లు కూడా అధిక సంఖ్యలో ఉన్నాఉరని తెలిపారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని సహారా కంపెనీ ఆశచూపడంతో లక్షలాది మంది కొన్ని కోట్ల రూపాయలను పొదుపు చేశారని, గడువు పూర్తయినా చెల్లించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కోర్టులో కేసులు ఉన్నాయని సాకులు చెబుతూ ఖాతాదారులకు న్యాయం చేయలేదని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు ముందు అమిత్‌షా బిజెపిని గెలిపిస్తే ఖాతాదారులందరికీ డిపాజిట్లు చెల్లిస్తామని చెప్పారని, కానీ నేటి వరకు పట్టించుకోలేదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం దేశ వ్యాప్తంగా ఉన్న 4కోట్ల మంది బాధితులకు కూడా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాదిలో ఖాతాదారులు ఏజెంట్లు పెద్ద ఎత్తున ఆందోళన చేసినా పట్టించుకోలేదన్నారు. అమిత్ షా కుమారుడికి, బిజెపికి అనుబంధంగా ఉన్న కొందరికి ఈ వ్యవహారంతో సంబంధాలు ఉన్నాయని ఆన్నారు. కేంద్రప్రభుత్వం ఖాతాదారు లందరికీ డబ్బులు జమ చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈనేపథ్యంలో నిర్వహించే కలెక్టరేట్ ధర్నాలో జిల్లాలోని సహారా బాధితులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సహారా ఇండియా సీనియర్ ఫీల్డ్ వర్కర్స్ వైఎ నాయుడు, బాలకృష్ణ, శ్రీనివాసరావు ,రాజశేఖర్, శ్రీనివాసరావు, మోహన్ రావు, సాయికృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

పశువులను రోడ్లపై విడిచిపెడితే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశువులను విచ్చలవిడిగా రోడ్లపై విడిచిపెడితే ఆ పశువులను స్వాధీనం చేసుకుని అపరాధ రుసుము వసూలు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు స్పష్టం చేశారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలలో క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. పారిశుధ్యం, కాలువల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. నీళ్ల ట్యాంక్ జంక్షన్లో రహదారిపై విచ్చలవిడిగా పశువులను విడిచి రోడ్లపైనే పశు వ్యర్థాలు దర్శనం ఇవ్వడంతో పశు పెంపకం దారులను పిలిచి మందలించారు. ఇటువంటి చర్యలు పునరావతం అయితే పశువులను స్వాధీనం చేసుకుంటామని అన్నారు. పైపులైన్లు లీకేజీలు లేకుండా సరి చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం కాలువలలో పూడిక పేరుకు పోవడానికి గమనించి తక్షణమే కాలువలను ప్రక్షాళన చేయాలని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉన్న రీత్యా ముందు జాగ్రత్తలు చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా సహకరించి కాలువల్లో రహదారులుపై చెత్తాచెదారాలు వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఇఇ కె.శ్రీనివాసరావు, కార్పొరేటర్ అల్లు చాణక్య, పారిశుధ్య పర్యవేక్షకులు రామకృష్ణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాజీ సిఎంను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని వైసిపి నాయకులతో పాటు సర్పంచులు గురువారం మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎ.రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి, నందిగాం సర్పంచ్ గరే మురళి, సవరవిల్లి సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు బైరెడ్డి యర్రప్పల నారాయణ రెడ్డి, రెడ్డికంచేరుకు చెందిన శీరపు గురునాథరెడ్డి తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.



జగన్‌మోహన్‌రెడ్డితో వైసిపి నాయకులు

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - తెర్లాం

మండల కేంద్రంలోని తెర్లాం, కునాయవలస, గొలుగువలస, జగన్నాధవలస గ్రామాల్లో యుద్ద ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఈ చర్యలు చేపడుతున్నామని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. కాలాంరాజుపేటలో విష జ్వరాలు వచ్చి ఒకరు మృతి చెందడంతో పాటు మరి కొంత మంది మంచాన పడటంతో అధికారులు పర్యటించారు. దీంతో మిగతా గ్రామాల్లో కదలిక వచ్చింది. ఇప్పుడు అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్య పనులను చేపడుతున్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో సర్పంచులు ఒక్కరో ఇద్దరో ఉన్న గ్రీన్ అంబాసిడర్లతోనే గొడ్డు చాకిరి చేయిస్తూ తప్ప గ్రామమంతా పూడికతీతలు తీయించడం లేదని దీనిపై అధికారులు దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రతి గ్రామంలో ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలు వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. మండల కేంద్రంలో జరిగిన పారిశుధ్య పనులను సర్పంచ్ బి. రూప, ఎంపిటిసి జి. ఆనందరావు పరిశీలించి బావులు, బోర్ల వద్ద క్లోరినేషన్ చేయించారు.

పాఠశాలలను పరిశీలించిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని మూడు పాఠశాలలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.వి రమణ గురువారం పరిశీలించారు. ముక్కాం, రామచంద్రపేట ఉన్నత పాఠశాలలతో పాటు భోగాపురం మోడల్ స్కూల్‌ని సందర్శించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. ముక్కాం పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రమణమూర్తి, చంద్రమౌళి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పార్వతి, నర్సింగరావు, విజయలక్ష్మి, సిఆర్‌పి మాత శేషు పాల్గొన్నారు.

చెరువు చప్టాలు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బాడంగి

మండలంలోని తెంటువలస గ్రామంలోని రైల్వే లైన్ పక్కనే ఉన్న గోపినాథ్ పట్నాయకుని చెరువు చప్టాను ఎమ్మెల్యే బేబినాయన గురువారం పరిశీలించారు. చెరువు నుంచి వర్షాకాలం వల్ల వచ్చే నీటి వరద దాటికి ఆ చప్టాలు పై నుంచి నీరు బైటకి వచ్చి పంటపొలాలకు నష్టం వాటిల్లుతోందని తెంటువలస, పెదపల్లి గ్రామ నాయకులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు, రైల్వే ఇంజినీర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైల్వే మూడోలైన్ చేపట్టడంతో ఇబ్బందులు ఉంటాయని అధికారులు తెలిపారు. సాధ్యమైనంత వరకు రైతులకు నష్టం లేకుండ చర్యలు తీసుకోవాలని అన్నారు.



చప్టాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

ప్రజాశక్తి - బొబ్బిలి

పరిసరాలు పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని సంఘవీధిలో గురువారం పారిశుధ్య పనులను పరిశీలించారు. కాలువలో పూడికలు పేరుకుపోవడంతో పారిశుధ్య కార్మికులతో పూడికలు తీసించారు. కాలువలలో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. రోడ్డు శుభ్రం చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యంగా ఉండగలమన్నారు. రోడ్లు, కాలువలలో చెత్త వేస్తే జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను ఆదేశించారు. ఆమెతో శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

ఆదర్శ పాఠశాల సందర్శన


ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక ఆదర్శ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి.వాల భాస్కరరావు గురువారం పరిశీలించారు. 1, 2 తరగతులలో గల విద్యార్థులను గణితం తెలుగు, ఆంగ్లంలో గల ప్రావీణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

వికలాంగులకు సేవ చేయడం అదృష్టం

ప్రజాశక్తి - కొత్తవలస

వికలాంగులకు సేవలందించడం అదృష్టంగా భావించాలని ఇటువంటి అవకాశం ఎవరికీ రాదని హాస్య బ్రహ్మ శంకర్ నారాయణ అన్నారు. గురువారం శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఎ ఎల్‌డి కలకత్తా వారి సహకారంతో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చిన సుమారు 100 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు, కాలిపర్స్, మోటార్ ట్రై సైకిల్స్, మాన్యువల్ ట్రై సైకిల్స్, వీల్చైర్స్, క్రచ్స్ చెవిటి మెషిన్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రత్నాకర్, ఎన్ఎఎల్‌డి టీమ్ సభ్యులు అభిమన్యు కుమార్, సుదీప్ రాయ్, అర్జునుడు, ట్రస్ట్ చైర్మన్ రావాడ జగదీశ్ ఖన్నా, ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ వి. ఫణీంద్ర, గురుదేవ హాస్పిటల్ బృందం, పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాలతో వికలాంగులు

గ్రోత్ సెంటర్ అభివృద్ధికి సహకరించండి

బొబ్బిలి: గ్రోత్ సెంటర్ అభివృద్ధికి సహకరించాలని చెలికాని అచ్చుతరావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు చెలికాని అచ్చుతరావు రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల, ఆహార ఉత్పత్తుల శాఖామంత్రి టిజి భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరాంధ్ర, గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై మంత్రితో చర్చించినట్లు చెప్పారు.

లోచర్లలో కంటి వైద్య శిబిరం

తెర్లాం: మండలంలో లోచర్ల గ్రామంలో నాయకులు జి.మునిస్వామి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రామంలో సుమారు 70 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 50 మంది వరకు కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక

బొబ్బిలి: స్థానిక ఎలిమ్ ప్రార్థనా మందిరంలో బొబ్బిలి ఫాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించి నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్.సీతారాంస్వామి, అధ్యక్షులుగా ధనుంజయనాయుడు, కార్యదర్శిగా పి.మోషే, ఉపాధ్యక్షులుగా ఆర్.నతానియేల్, సహాయ కార్యదర్శిగా వి.జాషువా, కోశాధికారిగా పి.తవిటినాయుడు, ముఖ్య సలహాదారుడిగా కె.కామేశ్వరరావు, సలహాదారులుగా సురేష్ బాబు, డి.ఆనంద్ మోహేరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని అధ్యక్షకుమార్, పి.మోజెష్ అభినందించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని మహారాణిపేటకు చెందిన పత్తిరి సన్యాసి (45) చెరువులో పడి మృతి చెందారు. గొల్లపల్లి వెంగళరాయ చెరువు సమీపంలో పశువుల మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ లోవరాజు చెప్పారు. భార్య వెంకట లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

విద్యార్థులకు 'వసతి' కష్టాలు

ప్రభుత్వ వసతి గృహాల పరిస్థితి అధ్వానంగా ఉంది. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ వసతి గృహాల్లో నిద్రించాలంటే రాత్రి సమయాల్లో భయంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. కిటికీలకు తలుపులు లేవు. కనీసం మరుగుదొడ్లకు కూడా తలుపులు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చును. వసతిగృహంలోని పై కప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడిపోతుంది. పిల్లర్స్ తాలూక ఐరన్ కూడా బయటకు కనిపించేంతగా పెచ్చులూడి పోవడంతో భవనం ఎప్పుడు కూలిపోతుందోనని బితుకు బితుకు మంటూ కాలం వెల్లదీస్తున్నారు.

- శిథిలావస్థలో ఎస్, బిసి హాస్టళ్లు
- తలుపులు లేని కిటికీలు, మరుగుదొడ్లు
- ప్రభుత్వ పాఠశాలలదీ అదే పరిస్థితి



శిథిలావస్థకు చేరిన తెర్లాం ఎస్‌సి వసతి గృహం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని ప్రభుత్వ బాలుర ఎస్‌సి, బిసి వసతి గృహాలున్నాయి. మండల కేంద్రంలో ఒక బిసి, ఒక ఎస్‌సి హాస్టల్‌తో పాటు పెరుమాలిలో మరో ఎస్‌సి హాస్టల్ ఉన్నాయి. మండల కేంద్రంలో ఉన్న వసతిగృహాల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నాయి. సరైన భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ పెచ్చులూడిపోవడంతో ఈ వర్షాకాలం ఎప్పుడు కూలిపోతుందోనని భయపడుతున్నారు. వసతి గృహానికి తలుపులు, కిటికీలు లేకపోవడంతో వండిన ఆహార పదార్థాలు కుక్కలు తినకుండా వాచ్‌మెన్ భోజనాలు పూర్తయినంత వరకూ ఆహార పదార్థాలకు కాపాలా ఉండాల్సి వస్తుంది. దీంతో ఈ వసతి గృహాల్లో చేర్పించేందుకు పిల్లల తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు.

గతంలో మూసి.. మళ్లీ తెరచి..

మండల కేంద్రంలో ఉన్న ఎస్‌సి హాస్టల్‌ను పిల్లలు లేరన్న ఆలోచనతో గతంలో మూడు సంవత్సరాలు మూసివేశారు. అప్పటి ఎమ్మెల్యే సుజయ్‌కృష్ణరంగారావు చొరవ తీసుకొని మళ్ళీ వసతి గృహాన్ని తెరిపించారు. ఇప్పుడు కూడా పిల్లలు అంతంత మాత్రంగానే చేరడంతో వసతి గృహం ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ హాస్టల్లో 25 నుంచి 30 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. పిల్లలను వసతి గృహంలో చేర్పించాలని ఇంటింటికీ ప్రచారం చేస్తున్నా ఎవరూ విముకత చూపడం లేదని, దీనికి వసతి గృహంలో సౌకర్యాలు లేకపోవడమే కారణమని వార్డెన్లు చెబుతున్నారు.



తలుపులు లేని ఎస్‌సి హాస్టల్లో మరుగుదొడ్లు

అందుబాటులో ఉండని వార్డెన్

మండల కేంద్రంలో ఉన్న బిసి వసతి గృహం ఇంఛార్జి వార్డెన్ దాసు ఎప్పుడూ వసతి గృహానికి అందుబాటులో ఉండరని ప్రచారం జరుగుతోంది. ఈ వసతి గృహ భవనం ప్రయివేటు వ్యక్తులది కావడం వల్ల అరకొర వసతులతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 45 నుంచి 50 మంది విద్యార్థులు ఉంటున్నారు. బిసి వసతి గృహానికి పర్మినెంట్ బిల్డింగ్ కావాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెరుమాళి వసతి గృహానిది మరో పరిస్థితి

పెరుమాళి ఎస్ వసతి గృహం పరిస్థితి మరోలా ఉంది. ఇక్కడ అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా ఈ గ్రావంలో జిల్లా పరిషత్ హై స్కూల్, ఎపి మోడల్ స్కూల్ ఉన్నప్పటికీ వసతి గృహంలో మాత్రం ఎవరూ చేరడం లేదు. ఈ వసతి గృహం కూడా శిథిలావస్థకు చేరింది. శిథిలావస్థకు చేరిన ఎస్ వసతి గృహాలను అక్కడి నుంచి మార్చి కొత్త భవనాలు నిర్మించి పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటింటికీ ప్రచారం చేస్తున్నాం

మండల కేంద్రంలో ఉన్న వసతి గృహంలో ప్రస్తుతం 30 మంది వరకూ విద్యార్థులున్నారు. గ్రామాల్లోకి వెళ్లి వసతి గృహాల్లో చేరాలని ప్రచారం చేస్తున్నాం. ఒక్కో గ్రామంలో ఇంటింటికీ తిరిగి చెబుతున్నాం. వసతి గృహాల్లో ఉన్న పిల్లలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని చెబుతున్నాం. కానీ వసతి సరిగా లేదని వెనుకడుగు వేస్తున్నారు. భవనం బాగు చేస్తే మరింత మంది చేరే అవకాశం ఉంది.

\- వై. అప్పన్న, వార్డెన్, ఎస్‌సి వసతిగృహం, తెర్లాం

పాఠశాలలదీ అదే తీరు..

మండలంలోని మోదుగువలస, ఆర్. గదబవలస, యు. గదబవలస గ్రామాల్లో ఉన్న పాఠశాల భవనాల అధ్వాన్నంగా ఉన్నాయి. మండలంలో శివారు గ్రామమైన మోదుగువలసలో పాఠశాలలో నలుగురు పిల్లలే ఉన్నారు. అక్కడ పనిచేస్తున్న టీచర్ పిల్లలకు తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నా శిథిల భవనంతో బిక్కుబిక్కుమంటూ పాఠాలు చెప్పాల్సి వస్తుంది. అక్కడ మధ్యాహ్న భోజన పథకం కూడా నిర్వాహకురాలు ఇంటి వద్ద నుంచి తీసుకొచ్చి పిల్లలకు పెడుతున్నారు. భవనం శిథిలావస్థలో ఉండటంతో వంట పాకలో నలుగురు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. దీనిపై ఎంఇఒను వివరణ కోరగా నూతన భవనం నిర్మించాలంటే కనీసం 20 మంది పిల్లలుండాలని లేకపోతే భవనం మంజూరు చేయడం కష్టమని చెబుతున్నారు. అయితే ఈ విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లలేక, ఇక్కడ శిథిలభవనంలో చదవలేక నరకయాతన పడుతున్నారు. వీరికి సౌకర్యాలు కల్పించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గిరిజన గ్రామంలోనూ అదే పరిస్థితి

మండలానికి మరో శివారు గ్రామమైన యు.గదబవలసలో చాలా మంది గిరిజనులు ఉంటున్నారు. ఇక్కడ పాఠశాలలో కూడా 13 మంది చదువుతున్నారు. ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో భవనం పైకప్పు పెచ్చులు పిల్లల మీద పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్. గదబవలస పాఠశాలలో 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ కూడా భవనాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అక్కడ ఉన్న పేద ప్రజలు ప్రైవేటు పాఠశాలల్లో చదువుకోడానికి స్తోమత లేక వసతులున్నా లేకపోయినా వెళ్లి చదువుకుంటున్నారు. వేరే గత్యంతరం లేక శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నామని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి భవనాలను నిర్మించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



యు.గదబవలసలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

ట్రిపుల్ ఐటికి పలువురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - బాడంగి

గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో బాడంగి జెడ్‌పి పాఠశాలలో చదివిన ముగడ గ్రామానికి చెందిన చిరు వ్యాపారి కుమారుడు మాసాబత్తుల జైగణేష్, బాడంగి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కుమారుడు మరడాన శివ సత్తా చాటారు. టెన్త్ ఫలితాల్లో 585 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీకి జైగణేష్ ఎంపిక కాగా, పదో తరగతిలో 578 మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి శివ ఎంపికయ్యాడు. వీరిని పాఠశాల హెచ్‌ఎం దత్తి సత్యన్నారాయణ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, నాయకులు అభినందించారు.

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాజీవ్ గాంధీ వైజ్ఞానికా సాంకేతిక విశ్వ విద్యాలయానికి ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటి నూజివీడు బ్రాంచ్‌కి మొన్న యామిని, ఉల్లి ఎర్రి నాయుడు, గేదెల మేఘన, ఒంగోలు ట్రిపుల్ ఐటికి లండ బాల చంద్రిక, శ్రీకాకుళం బ్రాంచ్‌కి సుంకరి హరి రారే, గుమ్మడి చరణ్ కుమార్, రొంగలి మేఘన, ఎర్రం శెట్టి మానస ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. వీరందరికీ ఇటీవల పదో తరగతిలో ఉత్తమ మార్కులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి విజయరామకుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీట్లు సాధించిన వారిలో బడబల్ల పూజిత నూజివీడు ట్రిబుల్ ఐటీ లోనూ, గెడ్డాపు కార్తీక్ శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీలోనూ, బీల అవినాష్ ఒంగోలు ట్రిబుల్ ఐటీ లోనూ సీట్లు సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది అభినందించారని చెప్పారు.

గంట్యాడ: మండలంలోని మదనాపురం ఆదర్శ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ రామకృష్ణారావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 -2024 సంవత్సరంలో 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన బి.వనిత నూజివీడు, కె సాయి దుర్గా, లోకేష్, ఎస్. హిమబిందు, వి అక్షయ, టి. రామచరణ్‌లు శ్రీకాకుళం ఐఐఐటిలో ప్రవేశాన్ని పొందారని చెప్పారు.

బొబ్బిలి: గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లు సాధించారు. పాఠశాలలో చదివిన కె.వాహిని 577 మార్కులు, ఎం.కావ్య 570 మార్కులు సాధించారు. వీరిద్దరు ట్రిపుల్ ఐటికు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆ బాధ్యత ప్రభుత్వానిదే

శృంగవరపుకోట: అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి కాంద్రేగుల ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాల బాల బాలికలను అంగన్వాడీలోనే ఉండేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకపోతే అంగన్వాడీ వ్యవస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రీ స్కూల్ పిల్లలను ప్రయివేటు పాఠశాలలో చేర్చుకోకుండా చర్యలు తీసికోనే విధంగా విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

దళితులపై దాడులు తగవు

నెల్లిమర్ల: దళితులపై ఎన్‌డిఎ కూటమి నాయకుల దాడులు తగవని వైసిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడాలి నాని అనుచరుడు తోట రాజేష్‌పై టిడిపి నాయకులు దాడి చేసి, భయభ్రాంతులకు గురిచేసారన్నారు. దీంతో ఆయన భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడన్నారు.

అలుగోలులో పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని అలుగోలులో గురువారం పశుగ్రాస వారోత్సవాలు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించారు. పసుగ్రాస వారోత్సవాల సందర్భంగా పాడి రైతులకు పశుగ్రాసల ప్రాముఖ్యత వాటి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ వై.వి రమణ రైతులకు పశుగ్రాసల వృద్ధి, ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి పాడి రైతు తన అవకాశం మేరకు కనీసం 25 సెంట్లు భూమిలో పశుగ్రాసాన్ని సాగుచేసుకొని దీనిపై వచ్చే పశు గ్రాసం దిగుబడితో రెండు పశువులను మేపుకొని పాల ఉత్పత్తి ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం 75శాతం రాయితీపై అందించిన మేలు రకపు జొన్న గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ జి. చక్రవర్తి, సతివాడ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, నాయకులు కురిమినేని దివాకర్, సారికి వైకుంఠం, ఆల్తి బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పశుగ్రాస వారోత్సవాలను వెలగవలస, విజయరామపురం గ్రామాలలో గురువారం డాక్టర్ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు పశుగ్రాస విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పచ్చగడ్డి వాడటం వల్ల కలిగే లాభాలను గురించి రైతులకు వివరించారు. వీటి వల్ల పాలు, పెరుగు, వెన్న శాతం పెరగడం లాంటి ఉపయోగాలు గురించి వివరించారు. పశుగ్రాసంలో పట్టుపురుగులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ పట్టులు తినడం వల్ల పశువులు అనారోగ్యం పాలవుతాయని చెప్పారు. డాక్టర్ అరుణ, సిహెచ్ రామినాయుడు, బి. దివ్య వాణి, జి. లావణ్య, డీ. తేజ పాల్గొన్నారు.



పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారి

విద్యాశాఖ పనితీరుపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల 12వ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎంపిడిఒ ఈశ్వరమ్మ సభను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో విద్యాశాఖ పనితీరు అస్తవ్యస్తంగా, అగమ్యగోచరంగా ఉందని సభ్యులు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మామిడివలస ఎంపిటిసి మడక తిరుపతినాయుడు మాట్లాడుతూ ప్రజా ప్రతినిదులను అగౌరవ పరిచే విధంగా విద్యాశాఖాధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. ఇటీవల స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో స్టూడెంట్ కిట్లు పంపిణీలో ప్రజాప్రతినిదులను పిలిచి అగౌరవంగా ప్రవర్తించారని కనీసం కూర్చోడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదని ఎమ్మెల్యే హాజరైన సభను చిన్న పోర్టికో వద్ద ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్తివలస గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి సబ్జెక్టు టీచర్ లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని సర్పంచ్ మజ్జి రాంబాబు ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనల వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం తగ్గి ప్రైవేటు పాఠశాలలకు ఆకర్షితులు అవుతున్నారని మండిపడ్డారు. మూలశెలగాం పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ విద్యను అభ్యసిస్తున్న 20 మంది విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని రావివలస సర్పంచ్ కురిడి కుమారి తెలిపారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖధికారులు స్పందించి మండలంలో విద్యావ్యవస్థను మెరుగుపరచాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ డిఇ అప్పారావు, ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మీ, తహశీల్దార్ సులోచనారాణి, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సమిష్టిగా ముందుకు సాగుదాం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బొబ్బిలి

వైసిపి శ్రేణులంతా కలిసి సమిష్టిగా ముందుకు సాగుదామని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం బొబ్బిలి నియోజకవర్గ వైసిపి విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే శంబంగి, మాజీ ఎంపీ బెల్లాన సమక్షంలో పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబం కలిసిమెలిసి పార్టీకి అండగా నిలవాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ ఓటమికి ఎవరు కుంగిపోవద్దని కార్యకర్తలకు, నాయకులకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మంచి చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. రాష్ట్రంలో టిడిపి అరాచకాలు అక్కడక్కడ మితిమీరుతున్నాయని, కక్ష సాధింపు చర్యలు చేపట్టడం మాని అభివృద్ధి పై దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, జెసిఎస్ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక జనాభాతో అనర్థాలు

ప్రజాశక్తి - కొత్తవలస

అధిక జనాభా వల్ల అనర్థాలు జరుగుతున్నాయని, జనాభా అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. వియ్యం పేట పిహెచ్‌సి పరిధిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు పిహెచ్‌సి సిబ్బంది, వైద్యాధికారి గోపాలకృష్ణ, బి. సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఉద్దేశించి వారు మాట్లాడుతూ అధిక జనాభా వల్ల విద్య, వైద్యం, పేదరికం, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, పర్యావరణ సమతుల్యం దెబ్బ తింటుందని తెలిపారు. 2024 థీమ్ 'టూ లీవ్ నో వన్ బిహైండ్ కౌంట్ ఎవ్వి రి వన్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. చిన్న కుటుంబం -చింత లేని కుటుంబం, కాన్పులు మధ్య ఎడం - తల్లీ బిడ్డలు ఆరోగ్యం, బాల్య వివాహాలు వద్దు - సరైన వయస్సులో వివాహం ముద్దు, కుటుంబ సంక్షేమం- దేశ సౌభాగ్యం వంటి నినాదాలు తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో. నరసింహారావు, పి. హెచ్. ఎన్. జగదాంబ, హెచ్. వి. పద్మావతి, హెచ్. ఎస్. ఈశ్వరరావు, ఫార్మసిస్ట్ అశ జ్యోతి, ఆప్తాలిమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ కుమార్, స్టాఫ్ నర్స్ దీప, ఎఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: దేశాభివృద్ధికి యువ జనాభా పాత్ర కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల ప్రపంచానికి కలిగే లాభాలను, నష్టాలను విద్యార్థులకు వివరించారు. దేశాభివృద్ధిలో యువ జనాభా యొక్క ఆవశ్యకతను విద్యార్థుల పాత్రను చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడేట్స్, కళాశాల విద్యార్థులందరూ పాల్గొన్నారు.

BOBBILI MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

Roc.No.74/2023/E1. Dt.11-07-2024

S.No.	Nit No.	No. of works	Estimated cost
1	03/2024-25/DyEE/1-6, dt.11.07.2024	6	Rs. 18.60 Lakhs

Bid Document Downloading Start Date : 12.07.2024 at 11.00 AM
Bid Document Downloading End Date : 19.07.2024 at 11.00 AM
Last Date & Time for receipt of Bids : 19.07.2024 at 03.00 PM
Technical Bid opening Date : 19.07.2024 at 04.00 PM

Note: Other details please read e.procurement market plan https://tender apeprocurement.gov.in

Commissioner,
Bobbili Municipality

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
E.P. 43/2023 IN O.S. 60/2019

Between:
Vemali Savitri and another ......Dhr
And:
Gopisetti Madhavi ....Defendant

NOTICE

To:
Gopisetti Madhavi W/o Parameswara Rao, resident of Door No. 14-58, Vijaya Electricals, Opposite to G.T. College Ground, Main Road, S.Kota Village and Mandal, Vizianagaram District.

Please take notice that the Dhr filed execution petition against you for execution of regular sale deed, and the above matter stands posted to 29.07.2024 for your appearance before the above said Honourable Court. Therefore, you have to appear before the above said court either personally or through an Advocate duly authorized at **10-30 A.M., on 29.07.2024** before the above court. Failing which the matter will be decided as per the material available on record.

CH. RAMBABU,
Advocate for Petitioner,
Vizianagaram